క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక: మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శేఖర్‌రెడ్డి సోమవారం ఆపరేషన్ స్మైల్ పోస్టర్ ఆవిష్కరించారు. బాలల హక్కుల పరిరక్షణపై అందరికి అవగాహన ఉండాలన్నారు. తప్పిపోయిన , అనాథ పిల్లలు, బాల కార్మికులు ఆపదలో ఉన్నవారు 100, 1098, 181 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందన, ఐసీసీఎస్ సోషల్ వర్కర్ రమేష్, చైల్డ్ లైన్ 1098 సభ్యుడు కుమారస్వామి, కానిస్టేబుల్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సందర్శన



తాడికల్ జీపీలో డీఎల్‌పీవో లత

శంకరపట్నం: కేంద్ర పంచాయతీ అవార్డులపై సోమవారం తాడికల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. మండలంలోని తాడికల్, ముత్తారం, ధర్మారం గ్రామాలపై కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న పంచాయతీ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో ప్రశ్నావళిని రూపొందించారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో తాడికల్‌ను హుజూరాబాద్ డీఎల్‌పీవో లత, ఎంపీడీవోలు దివ్యదర్శన్ రావు, స్వరూప, డీపీవో రవీందర్ సందర్శించారు. ఎంపీడీవో బషీరొద్దీన్, జీపీ కార్యదర్శుల నుంచి వివరాలు తీసుకున్నారు.

యాదవరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానిస్తున్న ఓనర్స్, డ్రైవర్స్

శంకరపట్నం: యాదవరత్న అవార్డు గ్రహీత కటికరెడ్డి బుచ్చన్నయాదవ్‌ను శంకరపట్నం ప్యాసింజర్ ఆటో యూనియన్ ఓనర్స్, డ్రైవర్లు సన్మానించారు. మండలంలోని కేశవపట్నంలో బుచ్చన్నయాదవ్ తోపాటు భవననిర్మాణ కార్మిక సంఘం జాతీయ సభ్యుడిగా ఎన్నికైన పిట్టల సమ్మయ్యకు సోమవారం సన్మానం చేశారు. మండల అధ్యక్షుడు కుమార్, రాజేందర్, సదయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు అందజేత



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న సభ్యులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్ విద్యార్థులకు చొప్పదండికి చెందిన వివేకానంద యూత్‌క్లబ్ సభ్యులు సోమవారం స్పోర్ట్స్ కిట్లును విరాళంగా అందించారు. విద్యార్థులు కిట్లును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షుడు రాము, ప్రిన్సిపాల్ రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, ప్రసాద్, సభ్యులుశ్రీనివాస్, తిరుపతి, మోహన్, అనూష్, శివ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక



రామడుగు: రాష్ట్రంలో రాజన్న రాజ్యమే ధ్యేయంగా వైఎస్సార్‌టీపీకి ప్రజలు అండగా నిలుస్తున్నారని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. ఇంటింటికీ వైఎస్సార్‌టీపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెదిర గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ అధినేత వైఎస్ షర్మిలారెడ్డి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయి కమిటీలు వేస్తామన్నారు. వెంట సీమకుర్తి లక్ష్మణ్, గుడిసె చంద్రయ్య, కల్లెపల్లి అంజయ్య పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపొద్దు



మానకొండూర్: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అధికారులు



గన్నేరువరంలో..

రామడుగు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం బాలికా దినోత్సవం సందర్భంగా బేటి బచావో..బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సఖీ కోఆర్డినేటర్ లక్ష్మి హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా, సెల్‌ఫోన్ వాడకం తగ్గించడం, అబార్షన్లు నిషేధంపై అవగాహన కల్పించారు. కవిత,ప్రభాకర్,భూమేష్,జయప్రద పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లిలో తల్లిదండ్రులకు లింగ వివక్ష, బాల్య వివాహాలు తదితర అంశాలు వివరించారు. అనంతరంతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను పెంచాలని కోరారు. సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, ఏఎస్ఎం శ్యామల, ఆశ స్వప్న, భాగ్య పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ కోలపురి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బాలికల రక్షణ ఆవశ్యకతపై చిన్నారులు వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కరుణ విద్యార్థులను అభినందించారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఏపీఎం లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇశ్రత్ సుల్తానా, సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ పి.అర్పిత సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సలహాలు, సందేహాలు, సూచనలు 9959225924 నంబర్‌కు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు తెలియజేయాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్, ఆసుపత్రి కరీంనగర్ సహకారంతో రాపర్తి అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం నిర్వహించనున్నామని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



గంగాధర: పంటను పరిశీలిస్తున్న అధికారులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో యాసంగి వరిలో తెగుళ్ల నివారణపై కేవీకె శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం పంటపొలాలను పరిశీలించి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. ఈకార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది హరీశ్, రైతులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలో మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, గంగాధర గ్రామాలలో మండల వ్యవసాయశాఖ అధికారి రాజు వరి పంటలను పరిశీలించారు. జింకు లోపంతో పాటు కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వార ఇంటింటికి నల్లానీరు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు, కొత్త పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు, కుల సంఘం భవనాల ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంతో పాటు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వమని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని తిరుమలాపూర్, గుండి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఆడపిల్లల పెళ్లికి అండగా ఆర్థికసాయం అందించడానికి కల్యాణలక్ష్మి పథకం అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు.

అర్హులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

చొప్పదండి: అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐద్వా, టీవీకేపీఎస్, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అంబటి రజితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడారు. పట్టాలు ఇచ్చిన పేదలకు ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సాయం అందించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు చొప్పదండిలో ఒక్కరికి ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో కోనేటి నాగమణి, కవ్వంపల్లి అజయ్, కొంపల్లి సాగర్, గజ్జెల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శంకర్

జమ్మికుంట: రైస్‌మిల్లుల్లో పనిచేసే ఆపరేటర్స్, దినసరి కూలీ, బార్దాన్ కార్మికులు, వాచ్‌మెన్‌ల జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా రైస్‌మిల్ ఆపరేటర్ ఆల్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం ఆడెపు రాజనర్సు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి తక్కువ వేతనాలకు పనులు చేయిస్తూ స్థానికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రేట్ల ఒప్పందం కోసం నోటీసులు అందజేసినా స్పందన లేదని చర్చల ద్వారా సమస్యలు పరిష్కారించాలని లేని పక్షంలో చట్టబద్ధంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి శోభన్, కమిటీ సభ్యులు సమ్మయ్య, రవి, సురేష్, రాములు, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన

మానకొండూర్: మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాని డెప్యూటీ డీఎంహెచ్‌వో వినత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, కంటి పరీక్షలు హాజరైనవారితో మాట్లాడారు. ఇప్పటి వరకూ చేసిన పరీక్షలు, శిబిరం ప్రాముఖ్యత తెలపాలని, అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు, మందులు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. డాక్టర్ కిరణ్‌కుమార్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ ఆలేఖ్య, సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్ సూపర్ వైజర్ ఎల్. రాజు, ఎ. స్వరూప రాణి, ఏఎస్ఎం శ్యామల, పావని, సరోజ, క్రిష్ణవేని, ఆశ పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. సుమారు 272 మందికి పరీక్షలు చేశామని, పలువురు కళ్ల అద్దాలకు పేరు నమోదు చేసుకున్నారని తెలిపారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ అనీల్ కుమార్, డాక్టర్ సంధ్యారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: మండలంలోని నిజాయితీగూడెం గ్రామంలో రూ. 20 లక్షలతో చేపట్టనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం తెలంగాణ సాంస్కృతిక చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేసారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు పూలమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీపీ కార్యాలయం అన్నీ హంగులతో నాణ్యతతో త్వరగా నిర్మించాలని అధికారులకు సూచించారు. భవనం పూర్తయితే కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీల్లో ప్రధాన సమస్య తీరినట్టేనని అన్నారు. మహిళా సంఘం భవనానికి పది లక్షలు, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇరవై లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తోటపల్లి రిజర్వాయర్ సాగునీటి కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో చివరి భూముల వరకూ సాగునీరు అందడం లేదని, కాలువల నిర్మాణానికి భూసేకరణ జరిగినప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే కాలువ తవ్వకాలు జరిపారని, చాలా చోట్ల కాలువ తవ్వాల్సి ఉందని అందుకే సాగునీరు రావడం లేదని ఎమ్మెల్యే ముందు గ్రామస్తులు వాపోయారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ గడ్డి రేణుక, సర్పంచ్ బోళ్ల మురళీధర్, ఉపసర్పంచ్ ఊరడి కొంరయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, గణేష్, శ్రీనివాస్, రమేష్, శంకర్, గౌష్, చంద్రమౌళి, వీరస్వామి గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తహసీల్దార్ కనకయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పాశంఅశోక్ రెడ్డి,నర్సింగరావు, సర్పంచులు, ఎంపీటీసీలు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై అనాసక్తి

- ఏటా పెరుగుతున్న వరిసాగు
- ఐదేళ్ల క్రితం మూడువేల ఎకరాల్లోపే
- అడవి జంతువులు కారణమంటున్న రైతులు



మాదాపూర్‌లో నాట్లు వేస్తున్న కూలీలు

గన్నేరువరం: మండలంలో ఈ ఏడాది ఆరుతడి పంటల సాగు తగ్గిపోయింది. అత్యధికంగా సాగు చేసే మొక్కజొన్న, వేరుశెనగ పంటల వైపు రైతులు ఆనాసక్తి చూపారు. ఇదే తరుణంలో వరి పంట సాగుకు మొగ్గుచూపారు. దీంతో ఆరుతడి పంటల సాగు గణనీయంగా పడిపోయింది. మొక్కజొన్న సాగు మూడు గ్రామాల్లో గతేడాది కన్నా అధికంగా సాగవుతున్న మిగతా గ్రామాల్లో తగ్గిపోయింది. యాసంగి వరినాట్లు ఇంకా కొనసాగుతున్నాయి.

మండలంలో..

రైతులు యాసంగి వరి పదివేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న 600, పొద్దు తిరుగుడు 400, ఆయిల్ పామ్ 110, కూరగాయలు 100, వేరుశెనగ 30 ఎకరాల్లో ప్రస్తుతం సాగవుతోంది. గతేడాది తొమ్మిది వేల ఎకరాల్లో వరి సాగైంది. రెండు వేల ఎకరాల్లో మొక్కజొన్న, పొద్దు తిరుగుడు 500, కూరగాయలు 200 ఎకరాల్లో సాగుచేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మొక్కజొన్నకు డిమాండ్

ప్రస్తుతం మొక్కజొన్నకు మార్కెట్‌లో క్వింటాల్ రెండు వేల ధర ఉంది. గతేడాది మార్కెట్‌లో రూ.2,600 ధర పలికింది. దీంతో ఈ ఏడాది మొక్కజొన్న సాగు పెరగవచ్చని అంచనా వేశారు. కానీ రైతులు ఎప్పటిలాగానే వరికే మొగ్గుచూపారు. మండలంలోని ఖాసీంపేట, మాదాపూర్ గ్రామాల్లోనే దాదాపు 450 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. మిగతా గ్రామాల్లో పదుల సంఖ్యలోనే సాగు చేస్తున్నారు. పొద్దు తిరుగుడు పంట పారువెల్ల గ్రామానికే పరిమితమైంది. వేరుశెనగ పంట ఖాసీంపేట, మాదాపూర్, మైలారం గ్రామాల్లో అత్యధికంగా సాగవుతుండేది. కానీ 30 ఎకరాలకు పడిపోయింది.

ఐదేళ్లలో మూడింతలు

ఏటా వరి సాగు పెరుగుతూ వస్తోంది. 2018 వరకు మూడువేల ఎకరాల్లో సాగయ్యేది గగనం. ఐదేళ్లలో మూడింతలు పెరిగింది. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా మండలంలోని ఉపకాల్వలకు నిరంతరం నీటి సరఫరా జరుగుతుండటంతో రైతులు శ్రమలేని వరికే మొగ్గుచూపుతున్నారు. ఇదే తరుణంలో మొక్కజొన్న, వేరుశెనగ పంటలకు అడవి పందులు, కోతులు తీవ్రం నష్టం కల్గించడం కూడా ఓ కారణమని రైతులు పేర్కొంటున్నారు.

మొగి పురుగుతో ఆందోళన

యాసంగి వరికి ఆదిలోనే మొగి పురుగు ఉధృతి ఆందోళన కల్గిస్తోంది. నారుమడి నుంచి మొదలైన మొగి పురుగు దాడి నాటు వేసిన పొలాలకు సోకింది. దీంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఉధృతి తగ్గడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలను సాగు చేసినా బాగుండని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాదనే ఆందోళనలో ఉన్నారు.

అడవి జంతువులతో నష్టం



గతేడాది 13 ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం 20 ఎకరాల్లో వరి సాగు చేశాను. మొక్కజొన్న, వేరుశెనగ పంటలకు అడవి జంతువులతో నష్టం వాటిల్లుతోంది. అందుకే వాటి నుంచి రక్షణకు వరి సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– గొల్లపల్లి రవి, రైతు, గన్నేరువరం

వరి సాగు పెరిగింది



గతేడాది కంటే ఈసారి వరి సాగు పెరిగింది. మొక్కజొన్న, వేరుశనగ, పొద్దు తిరుగుడుతో పాటు ఇతర పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

– కిరణ్మయి, వ్యవసాయాధికారి, గన్నేరువరం

అభిషేకం, ప్రత్యేక పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

చొప్పదండి: వాసవికన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణం సందర్భంగా పట్టణంలోని వాసవీ ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని మంగళపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆ లయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వెల్మ సూ రవ్వ భర్త పెద్ద లచ్చిరెడ్డి జ్ఞాపకార్థం పన్నెండు గుంటల భూమి, ఆలయ ధ్వజ స్తంభం నిర్మాణానికి ఎండపెల్లి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన వన్నెల అరుణఅంజన్‌రెడ్డిలు ఐదు లక్షలు విరాళంగా అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఏనుగు స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారు కేసీ క్యాంపులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యనిర్వాహక వర్గం సభ్యులు, వలంటీర్లు, ఇతరుల సహకారంతో స్వామివారి కల్యాణోత్సవం సజావుగా సాగింది. దేవస్థాన అర్చకులు నందకిశోరచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ కార్యవర్గం పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ ఘట్టం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో మానకొండూర్ ఎమ్మె ల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో సోమవారం నూతన చైర్మన్‌గా సాగి మలహాల్‌రావు, ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కిషన్‌రావు, ఈవో సుధాకర్, ప్రజాప్రతినిధులు , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.